## క్లుప్తంగా

### నేడు అప్రెంటిస్‌షిప్ మేళా

కంచరపాలెం: పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ)లో కోర్సులు పూర్తి చేసి అప్రెంటిస్ చేయని అభ్యర్థుల కోసం కంచరపాలెంలోని విశాఖ ప్రభుత్వ పాత ఐటీఐ కళాశాల ఆవరణలో సోమవారం ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటిసిషిప్ మేళా-2025 నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్, జోన్-1 ఉప సంచాలకుడు ఆర్ వి.రమణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈస్ట్ కోస్ట్ రైల్వే, హిందుస్తాన్ షిప్‌యార్డ్, ఆలిండియా రేడియో, మేధా సర్వో డ్రైవ్స్, జయభేరి లిమిటెడ్ కంపెనీలతోపాటు 12కి పైగా ప్రముఖ ప్రభుత్వ, ప్రైవేటు కంపెనీలు పాల్గొంటాయని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు సోమవారం ఉదయం 9 గంటలకు బయోడేటా, ధ్రువపత్రాలతో హాజరు కావాలని కోరారు.

### భవన నిర్మాణ కార్మికులను పట్టించుకోని ప్రభుత్వం



కొమ్మాది జంక్షన్ వద్ద పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు, భవన నిర్మాణ కార్మికులు

మధురవాడ: భవన నిర్మాణ కార్మికుల సమస్యలను కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ విశాఖ జిల్లా ఉపాధ్యక్షుడు పేడాడ రాజశేఖర్ అన్నారు. ఆదివారం ఉదయం కొమ్మాది జంక్షన్ ఏకే ప్యాషన్స్ సెంటర్ వద్ద భవన నిర్మాణ కార్మికుల నిరసన కార్యక్రమ పోస్టర్‌ను సీఐటీయూ నాయకుడు పి.రాజ్‌కుమార్‌తో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి నాయకులు ఎన్నికల సమయంలో కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 15న విజయవాడలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించనున్నామని తెలిపారు.రాజ్‌కుమార్, టి.తిరుపతిరావు, వెంకటేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

### నీలమ్మ వేపచెట్టు అమ్మవారికి పౌర్ణమి పూజలు



నీలమ్మ వేపచెట్టు అమ్మవారికి క్షీరాభిషేకం చేస్తున్న భక్తుడు

అల్లిపురం: పంచపౌర్ణమి పూజల్లో భాగంగా భాద్రపద పౌర్ణిమ సందర్భంగా ఆదివారం అస్సాం గార్డెన్స్‌లోని నీలమ్మ వేపచెట్టు అమ్మ వారికి విశేష పూజలు, క్షీరాభిషేకం చేశారు. ఆలయ అర్చకుడు జోగారావుశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ముందుగా పంచామృతాభిషేకాలు చేపట్టారు. అనంతరం భక్తులు స్వయంగా అమ్మవారికి క్షీరాభిషేకం చేశారు. ఆషాఢ పౌర్ణమి, శ్రావణ పౌర్ణమి, భాద్రపద పౌర్ణమి, ఆశ్వయుజ పౌర్ణమి, కార్తీక పౌర్ణమి పూజలు ప్రతి ఏడాది నిర్వహించనున్నట్లు అర్చకుడు తెలిపారు.

### ఘనంగా మహాత్మా గాంధీ క్యాన్సర్ హాస్పిటల్ వార్షికోత్సవం



కార్యక్రమం ప్రారంభిస్తున్న డాక్టర్ మురళీకృష్ణ, తదితరులు

ఎంవీపీ కాలనీ : ఎంవీపీ కాలనీలోని మహాత్మా గాంధీ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ 20వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ వి.మురళీకృష్ణ మాట్లాడుతూ 20 ఏళ్లుగా క్యాన్సర్ చికిత్సతోపాటు అవగాహన పెంచడంలో సమాజానికి విలువైన సేవలు అందించామన్నారు. 2005లో కేవలం 6 పడకలతో ప్రారంభమైన హాస్పిటల్ ప్రస్తుతం తూర్పు భారతదేశంలో ఉత్తమమైన క్యాన్సర్ ఆస్పత్రుల్లో ఒకటిగా ఎదిగిందన్నారు. ఈ ప్రయాణంలో సహకారం అందించిన వైద్యులు, స్వచ్ఛంద సంస్థలకు కృతజ్ఞతలు తెలియజేశారు.



హెల్త్‌సిటీలో పొందిన 12 వేల చదరపు గజాల స్థలంలో వైద్యుడు నిర్మించిన షెడ్



హెల్త్‌సిటీలో వైద్య సేవలు అందిస్తున్న ఆస్పత్రులు



నిరుపయోగంగా ఉన్న ఎల్‌ఎల్‌పీ (వెల్‌కమ్) ఆస్పత్రి

# స్థలాలే ముద్దు... ఆస్పత్రులు నిర్మించొద్దు

- ఇదీ ఆరిలోవ హెల్త్‌సిటీలో కొందరి వైద్యుల తీరు
- ప్రజలందరికీ ఆధునిక వైద్యం అందాలని హెల్త్‌సిటీకి దివంగత మహానేత వైఎస్సార్ శ్రీకారం
- ఆస్పత్రుల ఏర్పాటుకు ఏపీఐఐసీ ద్వారా తక్కువ ధరకే స్థలాల కేటాయింపు
- 17 ఏళ్లు గడుస్తున్నా నేటికీ చాలా స్థలాల్లో ఆస్పత్రులు నిర్మించని వైద్యులు
- స్థలాలు కాపాడుకునేందుకే ప్రాధాన్యమిస్తున్నారని ఆరోపణలు
- అయినప్పటికీ ఆ స్థలాలు స్వాధీనం చేసుకోని ఏపీఐఐసీ అధికారులు

"అందరికీ ఆధునిక వైద్యం అందాలి... అందుకోసం మెరుగైన వైద్య సదుపాయాలతో కొత్త ఆస్పత్రుల నిర్మాణం జరగాలి... అలా జరగాలంటే ప్రభుత్వమే చొరవ చూపి తక్కువ ధరకు స్థలాలిస్తే వైద్యులు ఆస్పత్రులు నిర్మించి వైద్య సేవలందిస్తారు..." ఇదీ దివంగత మహానేత, ఆనాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అద్భుత ఆలోచన. ఆ ఆలోచనకు అనుగుణంగానే హెల్త్‌సిటీకి శ్రీకారం చుట్టారు. పశుసంవర్ధక శాఖకు చెందిన సుమారు 200 ఎకరాల స్థలాన్ని ఆస్పత్రుల నిర్మాణానికి ముందుకొచ్చిన వారికి ఏపీఐఐసీ ద్వారా కేటాయించారు. ఆనాడు వైఎస్సార్ అందించిన సహాయ సహకారాలతో కొందరు ఆస్పత్రులు నిర్మించి వైద్య సేవలందిస్తున్నారు. మరికొందరు మాత్రం "స్థలాలే ముద్దు... ఆస్పత్రులు నిర్మించొద్దు" అన్నట్లు వ్యవహరిస్తున్నారు. నేటికి 17 ఏళ్లు గడుస్తున్నా స్థలాలు పొందిన వారిలో చాలా మంది ఆస్పత్రుల నిర్మాణానికి ముందుకు రావడం లేదు. ఫలితంగా మహానేత రాజన్న లక్ష్యం పూర్తి స్థాయిలో నెరవేరడం లేదు. మరోవైపు నిర్మాణాలు చేపట్టకపోయినా ఏపీఐఐసీ అధికారులు ఆ స్థలాలను ఎందుకు స్వాధీనం చేసుకోవడం లేదో ఎవరికీ అంతు చిక్కడం లేదు. – ఆరిలోవ

**ఆగమేఘాలపై స్థలాల కోసం ముందుకొచ్చి...**

ఆరిలోవ ప్రాంతం పెదగదిలి నుంచి చినగదిలి, దీన్‌దయాల్‌పురం వరకు ఉన్న హెల్త్‌సిటీలో ఏళ్లు గడుస్తున్నా కొన్ని ఆస్పత్రులు వైద్య సేవలు అందించడం లేదు. పేద, మధ్య తరగతి ప్రజలకు కూడా ఆధునిక విధానంలో మెరుగైన వైద్యం అందించాలనే ఆలోచనతో 2007లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వ స్థలాలను తక్కువ ధరకే ఆస్పత్రుల నిర్వాహకులకు ఏపీఐఐసీ ద్వారా కేటాయించారు. రూ.కోట్లు విలువ చేసే భూమి రూ.లక్షల్లో వస్తుండడంతో ఆగమేఘాలపై కొందరు వైద్యులు ముందుకొచ్చి సేవలందిస్తామంటూ ఆస్పత్రుల కోసం స్థలాలు పొందారు. ఆ స్థలాలు పొందిన అనంతరం కొందరు ఆస్పత్రులు నిర్మించి వైద్య సేవలు అందిస్తుండగా మరికొందరు ఇంత వరకు నిర్మాణాలే జరపలేదు. కొందరు నిర్మాణాలు కొనసాగిస్తుండగా ఇంకొందరు ఖాళీ స్థలాలను భద్రపరుచుకొంటున్నారు. దీంతో స్థలాలు సొంతం చేసుకోవడానికి ఆనాడు చేసిన కృషిలో కొంతైనా వైద్య సేవలు అందించడంలో ప్రస్తుతం చూపడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. సుమారు 17 ఏళ్లు గడుస్తున్నా నిర్మాణాలు పూర్తిచేయనవ్వటికీ ఏపీఐఐసీ అధికారులు పట్టించుకోకపోవడంపై పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**28 మంది వైద్యులకు స్థలాల కేటాయింపు**

అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని అన్ని విభాగాల వైద్య సేవలు ఒకేచోట రోగులకు అందుబాటులో ఉండాలని ఆశించారు. ఇందులో భాగంగా ఇక్కడ హెల్త్‌సిటీ పేరుతో పశు సంవర్ధక శాఖకు చెందిన సుమారు 200 ఎకరాల స్థలాన్ని ఆస్పత్రుల కోసం కేటాయించారు. ఆస్పత్రులు నిర్మించి వైద్య సేవలు అందించాలనే ఆసక్తి గల వారికి ఈ స్థలాలు ఏపీఐఐసీ ద్వారా అందించారు. దీని ప్రకారం అప్పట్లో 28 మంది వైద్యులు ముందుకు రావడంతో వారికి స్థలాలు కేటాయించారు. ఆ స్థలాలు పొందినవారు ప్రభుత్వ నిబంధనలు, సూచనల ప్రకారం వెంటనే ఆస్పత్రులు నిర్మించి ప్రజలకు వైద్య సేవలు అందించాలని అప్పట్లోనే ఏపీఐఐసీ అధికారులు ఆదేశించారు. ఆ నిబంధనల ప్రకారం ఆస్పత్రులు నిర్మించి కొందరు మాత్రమే సేవలు అందిస్తున్నారు. మరికొందరు వైద్యులు స్థలాలు సొంతం చేసుకొని సేవలు అందించడానికి మాత్రం నేటికీ ముందుకు రావడం లేదు.

**ఆ రెండు ఆస్పత్రుల తీరే వేరు..**

హెల్త్‌సిటీలో మరో రెండు ఆస్పత్రుల తీరే వేరు అన్నట్టు ఉంది. జిమ్స్, ఎల్‌ఎల్‌పీ (వెల్‌కమ్) ఆస్పత్రుల నిర్మాణం జరిగి ఏళ్లు గడిచినా నిరుపయోగంగానే ఉన్నాయి. ఇక్కడ గొలగాని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (జిమ్స్) పేరుతో ఓ వైద్యుడు సుమారు ఎకరం స్థలం ఏపీఐఐసీ నుంచి తీసుకుని ఆస్పత్రి నిర్మించి వదిలేశారు. కొన్నాళ్లు దీన్ని నిర్వాహకుడు ఈఎస్ఐకి అద్దెకు ఇచ్చుకొన్నారు. మూడేళ్ల క్రితం ఈఎస్ఐ అధికారులు కూడా దీన్ని ఖాళీ చేసేశారు. ప్రస్తుతం ఇది సేవలు అందించకుండా నిరుపయోగంగా ఉంది. దీని పక్కనే ఎల్‌ఎల్‌పీ ఆస్పత్రి నిర్మాణం పూర్తయి నాలుగేళ్లు గడిచింది. ఇంతవరకు దీన్ని ప్రారంభించి సేవలు అందించకుండా నిరుపయోగంగా వదిలేశారు. మరో వైద్యుడిది ఇంకోదారి అన్నట్లుంది పరిస్థితి. ఇక్కడ శుశ్రుత ఈఎన్‌టీ ఆస్పత్రి పక్కన ఓ వైద్యుడు ఆస్పత్రి నిర్మాణం కోసం సుమారు 12000 చదరపు గజాల స్థలం తీసుకొన్నారు. ఆ స్థలంలో ఇంతవరకు నిర్మాణం ప్రారంభించ లేదు. ఆ స్థలాన్ని తన స్వాధీనంలో ఉంచుకోవడానికి చిన్న రేకుల షెడ్ నిర్మించుకుని వదిలేశారు. నిజానికి నిబంధనల ప్రకారం ఇక్కడ వైద్య సేవలు అందించని ఆస్పత్రులపై ఏపీఐఐసీ చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఆస్పత్రుల నిర్మాణం చేపట్టకుండా ఖాళీగా వదిలేసిన స్థలాలను వెనక్కు తీసుకోవచ్చు. అయినప్పటికీ ఏపీఐఐసీ అధికారులు అలాంటి వారిపై చర్యలు తీసుకోకుండా వారికి కొమ్ముకాస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆనాడు స్థలాలు పొంది నేటికీ ఆస్పత్రులు నిర్మించని వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



ఎనిమిదేళ్లుగా నిర్మాణ దశలోనే ఉన్న ఆస్పత్రులు



నిరుపయోగంగా ఉన్న జిమ్స్ ఆస్పత్రి

**నాడు రూ.లక్షల్లో... నేడు రూ.కోట్లలో...**

ప్రారంభంలో 28 ఆస్పత్రుల నిర్మాణానికి ఏపీఐఐసీ ఇక్కడ స్థలాలను అప్పట్లో అతి తక్కువ ధరకు కేటాయించింది. అప్పట్లో రూ.లక్షల్లో ఏపీఐఐసీ నుంచి కొనుగోలు చేసిన ఆయా స్థలాలు విలువ ప్రస్తుతం రూ.కోట్లుకు పెరిగింది. అందుకే కొందరు ఆ స్థలాలను కాపాడుకుని వైద్యం పక్కన పెట్టేశారు. హెల్త్‌సిటీలో అపోలో, కేర్, క్యూ1, పినాకిల్, శుశ్రుత, ఎంటీ, జీజే, రెయిన్‌బో, విజయ్ మెడికల్స్, మెడికవర్ (పాత ఏబీసీ) యునిక్, వర్మ, ఒమేగాతోపాటు మరికొన్ని ఆస్పత్రులు, ఓ హోటల్, సర్జికల్ మెడికల్స్ మాత్రమే హెల్త్‌సిటీలో అందుబాటులో ఉన్నాయి. ఇక్కడ రెండు ఆస్పత్రుల నిర్మాణం జరిగినప్పటికీ సుమారు నాలుగేళ్లగా సేవలు అందించకుండా ఖాళీగా ఉంచేశారు. మరో ఆరు ఆస్పత్రులు నిర్మాణ దశలోనే ఉన్నాయి.

# రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో అక్రమ కేసులు

- కూటమి ప్రభుత్వాన్ని ప్రజలే గద్దె దించాలి
- వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు



ఇసుకతోటలో కరపత్రం అందిస్తున్న వైఎస్సార్ సీపీ సమన్వయకర్త మొల్లి అప్పారావు, నాయకులు

మద్దిలపాలెం : రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో రాష్ట్రంలో రావణ రాజ్యాన్ని నడుపుతున్నారని, దీన్ని ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని, తగిన సమయంలో బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా వున్నారని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు అన్నారు. జీవీఎంసీ 16వ వార్డు ఇసుకతోట సమీప రెల్లివీధిలో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ' కార్యక్రమం వార్డు అధ్యక్షుడు చొల్లంగి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మొల్లి అప్పారావు గడప గడపకు వెళ్లి చంద్రబాబు చేసిన మోసాలను వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధిని, సంక్షేమాన్ని పక్కనపెట్టి రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలను అక్రమంగా అరెస్ట్ చేయించడమే పరిపాలనగా భావించడం చాలా దురదృష్టకరమన్నారు. కూటమి ప్రభుత్వం గద్దె దిగేవరకు మోసపోయిన ప్రజలందరూ సైనికుల్లా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర వలంటీర్ విభాగం ప్రధాన కార్యదర్శి పులగం శ్రీనివాస రెడ్డి, వార్డు మహిళ విభాగం అధ్యక్షురాలు ఒమ్మి పోలరత్నం, యూత్ అధ్యక్షుడు కొంగరాని రాంబాబు, సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పిలక మధుసూదన రెడ్డి, మీసాల ప్రదీప్, డొక్కర రాజు, సంధ్య, జగదీశ్వరి, శశికళ, బమ్మిడి జోగారావు, బుగత మధు, చింతా వెంకటరావు, బొబ్బిలి రాంబాబు, జాన్ ప్రసాద్, మహేష్ పాల్గొన్నారు.

# స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు ప్రభుత్వం కుట్ర





రామకృష్ణాపురంలో పాదయాత్ర చేస్తున్న సీపీఎం నాయకులు

ఆరిలోవ : విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా గాజువాకలో ఈ నెల 11న నిర్వహించనున్న సీపీఎం బహిరంగ సభకు అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరుతూ సీపీఎం నాయకులు ఆదివారం పాదయాత్ర చేపట్టారు. జీవీఎంసీ పదమూడో వార్డు పరిధి రామకృష్ణాపురం, శ్రీకృష్ణాపురంలో చేపట్టిన పాదయాత్రలో సీపీఎం మద్దిలపాలెం జోన్ కార్యదర్శి వి.కృష్ణారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి, కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్నాయన్నారు. ఎన్నికల సమయంలో కూటమి నాయకులు స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకుంటామని హామీ ఇచ్చారన్నారు. అధికారం చేపట్టిన తర్వాత ఆ హామీని పక్కన పెట్టేశారని విమర్శించారు. కూటమి నాయకులు ప్రధానమంత్రి మోడీపై ఒత్తిడి తీసుకొచ్చి స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించేలా ప్రయత్నించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను 46 ముక్కలుగా చేసి దొడ్డిదారిన ప్రైవేటీకరించేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించకుండా అడ్డుకోవడానికి గాజువాకలో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలంతా సభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నరేంద్రకుమార్, రత్నం, ఆదినారాయణ, గణపతి, లక్ష్మీనారాయణ, రాము పాల్గొన్నారు.

# క్షేత్రస్థాయిలో వైఎస్సార్ సీపీని బలోపేతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న మొల్లి అప్పారావు

మద్దిలపాలెం : తూర్పు నియోజకవర్గంలో క్షేత్రస్థాయిలో వైఎస్సార్ సీపీని బలోపేతం చేయడానికి నాయకులు, కార్యకర్తలు, అనుబంధ విభాగాల అధ్యక్షులు చిత్తశుద్ధితో పనిచేయాలని ఆ పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు సూచించారు. సీతమ్మధారలో గల కార్యాలయంలో జిల్లా, నియోజకవర్గ వివిధ విభాగాల అధ్యక్షులతో ఆదివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్సార్ సీపీని ఏవిధంగా బలోపేతం చేయాలి.., పార్టీ కార్యక్రమాల విజయవంతంలో కేడర్ పాత్ర ఎలా వుండాలో దిశానిర్దేశం చేశారు. అందరూ సమిష్టిగా పనిచేసి ప్రజలను చైతన్యవంతులను చేసి, నూతనోత్తేజాన్ని తీసుకురావాలని సూచించారు. రానున్న ఎన్నికల్లో పార్టీని గెలిపించేందుకు అనుసరించాల్సిన వ్యూహాలు సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర వలంటీర్ విభాగం ప్రధాన కార్యదర్శి పులగం శ్రీనివాసరెడ్డి, జిల్లా ఎంప్లాయిస్ – పెన్షనర్స్ విభాగం అధ్యక్షుడు దేవరకొండ మార్కండేయులు, వలంటీర్ విభాగం జిల్లా అధ్యక్షుడు పీలా ప్రేమ్ కిరణ్, సోషల్ మీడియా విభాగం జిల్లా అధ్యక్షుడు బోండా ఉమామహేశ్వరరావు, వివిధ విభాగాల నియోజకవర్గ అధ్యక్షులు సూరిశెట్టి రావాలు, కాగితాల రవి కిరణ్ రెడ్డి, వైద నారాయణరావు, బంగారు భవానీ శంకర్, ఎండీ మక్బూల్, పీలా జోషీల, మద్ది వెంకటరావు, కిముడు భాస్కర్, చింతాడ శ్రీనివాసరావు, మొల్లి వెంకటరమణ, బేతా దుర్గారావు, బొడ్డేటి వేణుగోపాల్, పిలక తరుణ్ రెడ్డి, కాగితాల వెంకటరమణ రెడ్డి, పిలక మధుసూదన రెడ్డి, మొల్లి సింహాద్రి, రాపేటి సన్యాసినాయుడు పాల్గొన్నారు.

# కుప్పలుగా వినాయక పూజా సామగ్రి



జోడుగుళ్లపాలెం వద్ద ఒడ్డుకు చేరిన వినాయక ప్రతిమలను పరిశీలిస్తున్న జెడ్సీ కనకమహాలక్ష్మి



జోడుగుళ్లపాలెం వద్ద కుప్పలుగా చేరిన పూజా సామగ్రి, కర్రలు, గడ్డి

ఆరిలోవ : వినాయక నవరాత్రి మహోత్సవాలు నగరంలో ఘనంగా ముగిశాయి. శనివారం రాత్రి సముద్ర తీరంలో నిమజ్జనాలు జరిగాయి. ఇందులో భాగంగా జోడుగుళ్లపాలెం తీరం వద్ద నిమజ్జనం చేసిన వినాయక ప్రతిమలు మట్టితో చేసినవి నీటిలో కరిగిపోగా, ఇతర వస్తువులతో తయారు చేసినవి, మట్టి ప్రతిమలపై దట్టంగా వేసిన రంగులు కారణంగా కరగనివి ఒడ్డుకు కొట్టుకొచ్చాయి. వాటితోపాటు పెద్ద బొమ్మలు కరిగిపోగా వాటిని తయారు చేసేటప్పుడు వినియోగించే కర్రలు, గడ్డి, గూళ్లు మాదిరిగా సముద్ర కెరటాలకు ఒడ్డుకు కొట్టుకొచ్చాయి. వాటిని ఆదివారం తొమ్మిదో వార్డు పారిశుధ్య కార్మికులు సేకరించి కుప్పలుగా వేశారు. జోడుగుళ్లపాలెం తీరాన్ని సందర్శించిన జోన్ – 2 కమిషనర్ కనకమహాలక్ష్మి వాటిని పరిశీలించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిన్నాజీతో మాట్లాడి పారిశుధ్య కార్మికులతో డంపింగ్ యార్డుకు తరలించారు. కుప్పలుగా పడిన ఈ సామగ్రిని కార్మికులు లారీలతో తరలించాల్సి వచ్చింది. గంగలో కరగని వినాయక ప్రతిమలు తిరిగి డంపింగ్ యార్డులోని చెత్త కుప్పల్లో కలపాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్‌లో పూర్తిస్థాయిలో మట్టి ప్రతిమలనే వినియోగించాలని కోరుతున్నారు.

# వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

తగరపువలస : ఆనందపురం మండలం వెల్లంకి జాతీయ రహదారిపై శ్రీకాకుళం జిల్లాకు చెందిన ద్విచక్ర వాహనదారుడిని ఆదివారం మధ్యాహ్నం గుర్తు తెలియని వాహనం బలంగా ఢీకొనడంతో కాలు విరిగిపోయింది. క్షతగాత్రుడు ప్రమాద వివరాలు, తన వివరాలు చెప్పలేకపోతున్నాడు. ఆ ప్రాంతంలో సీసీ కెమెరాల ఆధారంగా ప్రమాదానికి కారకులను ఆనందపురం పోలీసులు గుర్తించాల్సి ఉంది. 108 సిబ్బంది క్షతగాత్రుడిని కేజీహెచ్‌లో చేర్పించారు. అలాగే ఆనందపురం మండలం పెద్దిపాలెం ప్యారడైజ్ హోటల్ వద్ద తగరపువలస వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనదారుడిని శనివారం కారు ఢీకొంది. క్షతగాత్రునికి తీవ్రంగా గాయాలు కావడంతో ఆనందపురం పోలీసులు సంగివలస అనిల్ నీరుకొండ ఆస్పత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

# వేడుకగా ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవం



వేడుకల్లో పాల్గొన్న ఫిజియోథెరపీ వైద్యులు, విద్యార్థులు

బీచ్‌రోడ్డు : ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవం సందర్భంగా ఫిజియోథెరపీ అసోసియేషన్ ఆఫ్ విశాఖపట్నం ప్రతినిధుల ఆధ్వర్యంలో ఆదివారం ఓ హోటల్‌లో వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీనియర్ న్యూరో ఫిజీషియన్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, వ్యాఘ్రేశ్వరుడు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిజికల్ మెడిసిన్ అండ్ రీహాబిలిటేషన్ (ఫిజియోథెరపీ కాలేజీ) ప్రిన్సిపాల్ సెంథిల్ కుమార్ అతిథులుగా హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో ఫిజియో వైద్యులు, వివిధ కాలేజీల విద్యార్థులు సుమారు 150 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జనరల్ బాడీని కండక్ట్ చేసి కమిటీకి ఎన్నికల షెడ్యూల్ ప్రకటించారు.

# ఇస్కాన్‌లో హరినామస్మరణ



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: హరేకృష్ణ, హరేరామ అంటూ సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరం హరినామస్మరణతో మార్మోగింది. వారాంతపు పూజల సందర్భంగా ఇస్కాన్ అధ్యక్షులు సాంబదాస్ ప్రభూజీ, మాతాజీ నితాయి సేవిని భగవద్గీత శ్లోకాలు, ప్రవచనాలు ఆదివారం ఆలపించారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు.